
మేడ్‌పల్లిలో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న సొరకాయ పంట


పోతంగల్ మండలం టాక్లీలో నేలరాలిన వడ్లగింజలు


మేడ్‌పల్లిలో వడగండ్ల వానకు దెబ్బతిన్న గోరుచిక్కుడు పంట

నిజామాబాద్‌లో అకాల వర్షం

# రాళ్లవాన.. రైతుకు వేదన

సాలూరా మండలం మందర్న శివారులో అకాల వర్షానికి నేలకొరిగిన వరి పంట



- ఏడు మండలాల్లో వెయ్యికి పైగా ఎకరాల్లో పంట నష్టం
- పలుచోట్ల రాలిన మామిడికాయలు, దెబ్బతిన్న కూరగాయ పంటలు

**ఆరుగాలం కష్టించి** సాగు చేసిన పంట కండ్ల ముందే కడగండ్లు మిగిల్చింది. మాయదారి రాళ్లవాన రైతుల పుట్టిముంచింది. అకాల వర్షందెబ్బకు చేతికొచ్చిన వరి పంట నేలరాలింది. నిజామాబాద్ జిల్లాలోని ఏడు మండలాల్లో సోమవారం రాత్రి కురిసిన వడగండ్ల వాన రైతులకు దుఃఖంలో ముంచింది. సుమారు వెయ్యికి పైగా ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది. కోతదశలో ఉన్న పంట వర్ష బీభత్సంతో పండుగ రోజే దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

బోధన్ రూరల్/ కోటగిరి / చందూర్, ఏప్రిల్ 9: నిజామాబాద్ జిల్లాలో సోమవారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన హోరెత్తించింది. కోటగిరి, వర్ని, మోస్రా, పొతంగల్, చందూర్, బోధన్, సాలూరా మండలాల్లో చేతికొచ్చిన వరి పంట నేలరాలింది. అకాల వర్షం అన్నదాతకు తీవ్ర నష్టాన్ని చేకూర్చింది. ఉమ్మడి కోటగిరి మండలం సోంపూర్, టాక్లీ, దోమలెడ్గి, వల్లభాపూర్, సుంకిని తదితర గ్రామాల్లో వడగండ్ల వానకు సుమారు 500 నుంచి 600 ఎకరాల్లో వరి పంట పూర్తిగా నేలమట్టమైందని వ్యవసాయాధికారులు చెప్పారు. కోతకు వచ్చిన వరి గింజలు పూర్తిగా నేలరాలాయి. చేతికొచ్చిన పంట కండ్లఎదుటే నష్టపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చందూర్ మండల కేంద్రంతోపాటు లక్ష్మాపూర్, మేడ్‌పల్లి, లక్ష్మీసాగర్ తండాలో వడగండ్ల వానతో సుమారు 250 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు. మెట్ట పంటలైన బెండ, సొరకాయ, గోరుచిక్కుడు లాంటివి కూడా రాళ్లవానకు దెబ్బతిన్నాయి. సాలూరా మండలంలోని హున్సా, మందర్న గ్రామాల్లో వరి పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. మందర్న శివారులో మామిడికాయలు రాలిపోయాయి. అకాల వర్షానికి సాలూర మండలంలో సుమారు 300 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని అధికారులు చెబుతున్నారు. అకాల వర్షంతో నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### రైతులకు అండగా ఉంటాం

అకాల వర్షంతో చేతికొచ్చిన వరి పంట పూర్తిగా దెబ్బతిన్నదని, పంట నష్టపోయిన రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను మంగళవారం పరిశీలించారు. కోటగిరి, పొతంగల్, చందూర్ తదితర మండలాల్లో పర్యటించిన ఆయన బాధిత రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించామని, పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఖాజాపూర్‌కు చెందిన సాయినాథ్ అనే రైతు టాక్లీలో 18 ఎకరాలు కౌలు తీసుకొని వరి సాగు చేయగా వడగండ్లకు పూర్తిగా నేలవాలిందని సురేందర్‌రెడ్డి ఎదుట కన్నీరుమున్నీరయ్యారు. అతడిని సురేందర్‌రెడ్డి ఓదార్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శంకర్‌పటేల్, చందూర్ ఎంపీపీ లావణ్య, బీఆర్ఎస్ కోటగిరి మండల కన్వీనర్ ఎజాజ్‌ఖాన్, అంబర్‌సింగ్, సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్, ఏఎంసీ మాజీ చైర్మన్ నీరడి గంగాధర్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చందూర్‌లో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్ రెడ్డి


మందర్న శివారులో రాలిపోయిన మామిడికాయలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు



### పదెకరాలు నష్టపోయా..

నా పేరు దివిటే మారుతి. టాక్లీ శివారులో 10 ఎకరాలు వడగండ్ల వానకు పూర్తిగా నష్టం జరిగింది. కోతకు వచ్చిన సమయంలో ఒక్కసారిగా వడగండ్ల వాన, ఈదురుగాలులకు వరిపంట దెబ్బతిన్నది. గింజలు పూర్తిగా రాలిపోయాయి. పంట నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలి.

## కాంగ్రెస్, బీజేపీవి కుమ్మక్కు రాజకీయాలు

- సుదర్శన్‌రెడ్డి, అర్వింద్ ఒక్కటే..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల
- దేశం, మతం పేరిట బీజేపీ ఓట్లు అడుగుతుంది
- నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

భీమ్‌గల్, ఏప్రిల్ 9: కాంగ్రెస్, బీజేపీలవి కుమ్మక్కు రాజకీయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండల కేంద్రంలోని మదర్సా నూర్‌మజీద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందులో బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి, మోదీ ఎలాగో జిల్లాలో సుదర్శన్‌రెడ్డి, అర్వింద్ ఒక్కటేనని అన్నారు. గత ఎన్నికల్లో జగిత్యాలలో ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి బహిరంగంగా అర్వింద్ గెలుపునకు సహకరించారన్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బోధన్‌లో సుదర్శన్‌రెడ్డి గెలుపు కోసం అర్వింద్ బీజేపీ నుంచి బలహీన అభ్యర్థిని నిలబెట్టాడన్నారు. అందులో భాగంగానే ఇక్కడి వారికి పరిచయంలేని జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబెట్టి అర్వింద్‌కు సహకరిస్తున్నారని, కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఇప్పటికైనా మైనార్టీ సోదరులు ఆలోచించాలని కోరారు. నిజామాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ చేసిన అభివృద్ధిని చూపకుండా దేశం,మతం పేరిట బీజేపీ ఓట్లు అడుగుతున్నదని మండిపడ్డారు. ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానన్న అర్వింద్.. ఐదేండ్లు గడిచినా బోర్డుకు అతీగతి లేదన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ఉన్న జీవన్ రెడ్డి ఎమ్మెల్సీగా ఏనాడూ ప్రజల మంచిచెడులో పాల్గొనలేదని విమర్శించారు. అనంతరం సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల, ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత, జడ్పీటీసీ రవి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మోయిజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సయ్య, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు అజ్మత్, అఫ్సర్, సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడు శవ్వ అశోక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, వేదికపై నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మైనార్టీ నాయకులు

### పోలీసుల విస్తృత తనిఖీలు



**నిజామాబాద్** నగరంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. మంగళవారం పలుచోట్ల వాహనదారులను ఆపి డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించారు. కంఠేశ్వర్, ఎల్లమ్మగుట్ట మధ్య రెండు చోట్లా తనిఖీలు చేపట్టడంతో పండుగ వేళ వాహనదారుల సమయం వృథా అయ్యింది. పూజ సామగ్రి కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు వెళ్లే హడావుడిలో సంబంధిత పత్రాలు వెంట తెచ్చుకోలేదని చెప్పినా వినిపించుకోలేదని కొందరు ఆవేదన వ్యక్తంచేశారు.

–వినాయక్‌నగర్, ఏప్రిల్ 9



## ఘనంగా ఉగాది సంబురాలు

### ఉగాది వేడుకల్లో పోచారం...

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఉగాది పర్వదినం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మాజీ స్పీకర్, పోచారం శ్రీనివాసరెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు






నీలకంఠేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు, పండితుల పంచాంగ శ్రవణం


కామారెడ్డిలో వేదపండితుల పంచాంగ శ్రవణం



సుభాష్‌నగర్/ కామారెడ్డి, ఏప్రిల్ 9: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన వేడుకలను మంగళవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. శ్రీ క్రోధి నామ సంవత్సర వేడుకల్లో భాగంగా ఆలయాల్లో అభిషేకాలు ప్రత్యేక పూజలతోపాటు పంచాంగ శ్రవణాలు, ఉగాది పచ్చడి వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. నిజామాబాద్‌లోని నీలకంఠేశ్వరాలయం, శంభులింగేశ్వరాలయం, ఉత్తర తిరుపతి క్షేత్రం, జెండా బాలాజీ మందిరం, పెద్దరాంమందిర్, చక్రం గుడి, సుభాష్‌నగర్ రామాలయం, లక్ష్మీగణపతి ఆలయం, వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయం, ఉమా మహేశ్వరాలయం... తదితర దేవాలయాల్లో ఉగాది వేడుకలను సంప్రదాయంగా నిర్వహించారు.

### కోపంతో అరిష్టాలు

శ్రీ క్రోధి నామ సంవత్సరంలో నవ నాయకులు అశుభంగా ఉండడంతో పాడి పంటలు ఆశించినంతగా ఉండవని ప్రజలకు, రాజుకు మధ్య వ్యతిరేకత ఎక్కువవుతుందని పండితులు పంచాంగ శ్రవణంలో తెలిపారు. ధరలు బాగా పెరుగుతాయని గురు, శుక్ర మౌఢ్యములు ఉండడంతో ఆరు నెలలపాటు శుభకార్యాలకు ముహూర్తాలు లేవన్నారు. వేద పండితులు చంద్రశేఖర్ శాస్త్రీ, సముద్రాల శ్రీధరాచారి, ప్రశాంత్‌జోషి, మధుసూదన్‌శర్మ తదితరులు వివిధ ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు.

### అట్టహాసంగా ఎడ్లబండ్ల ప్రదర్శన

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉగాది పర్వదినం సందర్భంగా వీక్లీ మార్కెట్‌లోని దుర్గమ్మ ఆలయ ఆవరణలో ఎడ్లబండ్ల ప్రదర్శన అట్టహాసంగా నిర్వహించారు. ఎడ్లను, బండ్లను అందంగా అలంకరించారు. ఎడ్లబండ్ల ప్రదర్శనను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో జనం తరలిరావడంతో ఆలయ ఆవరణ మొత్తం సందడి వాతావరణం నెలకొన్నది. ఈ ఏడాది మొత్తం ప్రజలు పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు. అంతకుముందు ఆలయంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, వేదపండితులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


కామారెడ్డిలో ఎడ్లబండ్ల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు